# జ్ఞాననేత్రం

"మీరిలాంటి పని మళ్ళీ చెయ్యనని మాట ఇవ్వండి"

విజయ ఏడుస్తోంది.

చక్రపాణికి చికాకుగా వుంది. తాను తలపెట్టిన ప్రణాళిక వృధా అయిపోయింది. తాను చేయబోయే పని విజయ కంటపడిపోయింది.

రాత్రి తాను 'ఎండ్రిన్' సీసాతెచ్చి ఏడు ఇరుకులమాటున దాచేడు. అది ఎలా కనబడిందో మరి, విజయదాన్ని బయటకు తీసింది.

మూత విప్పి వాసనచూసి "ఇదేమిటి? ఇలావాసనేస్తోందీ?" అంటూముఖం అదోలా పెట్టింది.

తాను బుకాయించి లాభం లేదు! అదేమిటో దాని వివరమేమిటో పక్కింటికి పోయి మరీ కనుక్కుని వస్తుంది విజయ.

అనవసరపు గొడవ! నలుగురిలో తాను నవ్వులు పాలుకావటం!! లేనిపోని చికాకులు అందుకే చెప్పేశాడు 'అది ఎండ్రిన్' అంటూ!

అంతే!

ఏడుపు మధ్యలోనే ఆ సీసాను బలంగా వీధిలోనికి గిరాటేసింది.

" మీ వరస చూస్తున్నాను. ఇలాంటి పని మీరేదో తలపెడతారని నాకు అనుమానంగానే ఉంది. మీరు ఎందుకంత బేలగా అయిపోతున్నారు? నాకూ, పిల్లలకూ అన్యాయం చేసి వెళ్ళిపోతారా?" అంటూ బావురుమంది.

చక్రపాణి గుండె ద్రవించిపోయింది.

గుండె ద్రవించినంతలో సమస్యలు ద్రవించిపోతాయా? మనసు కరిగినంతలో కష్టాలు కరిగి నీరయిపోతాయా? చక్రపాణిని పట్టిపీడిస్తున్న సమస్యపేరు దరిద్రం!

ఎనిమిది నెలల క్రితం ఫ్యాక్టరీలో ఉద్యోగం పోయింది. ఎందుకు పోయింది? తన తప్పులేకుండా పోయింది.

నాలుగేళ్ళుగా టెంపరరీగా నెట్టుకొస్తున్న బతుకు రోడ్డున పడింది.

ఈ నాలుగేళ్ళలోనూ రాము, సరస్వతి పుట్టేరు.

విజయ తాను తెచ్చే అయిదు వందలతోటే గుట్టుగానే సంసారం నడిపింది.

'మాకు స్టాఫ్ ఎక్కువయిపోయేరు! టెంపరెరీ వాళ్ళని ప్రస్తుతానికి తొలగిస్తున్నాం. మళ్ళీ కావాలంటే పిలుస్తాం' అంటూ 'రిట్రెంచ్‌మెంట్' కాగితం చేతికి ఇచ్చేరు.

తాను కాళ్ళావేళ్ళాపడినా లాభం లేదని తెలుసు. తనతోబాటు మరో ఇరవై మంది బయటకు వచ్చేరు. ఉద్యోగం తీసేసిన సమయంలో తన సేవలకు గుర్తింపుగా మూడువందల రూపాయలు ఇచ్చేరు కంపెనీ వారు. రూలు ప్రకారం ఇవ్వనవసరం

లేకపోయినా, తాము దయతలచి ఆ సొమ్ము ఇస్తున్నామని చెప్పేరు. వాళ్ళ దయతో ఇచ్చిన ఆ సొమ్ముతో మరొక నెలరోజులు గడిచేయి.

ఈలోగా ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు.

కానీ, ఫలితం లేకపోయింది.

అప్పటి నుండీ విజయపెట్టెలోని సారె సామానులు, ఒక వెండి పళ్ళెం, పట్టుబట్టలు మెల్లగా నడిచి మార్కెట్‌లోకి, మార్వాడీ కొట్లలోకి వెళ్ళిపోయాయి.

నాలుగు నెలలు తిరిగేసరికి పసుపుకొమ్ము, తాడు మినహా విజయమెడలో ఏమీ మిగలలేదు. చేతులు అంతకుముందే బోసిపోయాయి.

"నేను అప్పడాలు తయారు చేస్తాను, వాటిని ఏదైనా కిరాణాషాపులకు ఇచ్చిరండి" అంది విజయ ఒక రోజున.

చక్రపాణి కస్సుమన్నాడు. ప్రాణం పోయినాసరే అలాటిపని చేయనన్నాడు.

విజయ మౌనంగా వుండిపోయింది.

నాలుగురోజులు తరువాత విజయసలహా తప్ప వేరేగతి లేకపోయింది.

అప్పడాలు షాపులకు వేస్తే రోజూ అయిదురూపాయలు మిగిలేది. కానీ, ఖర్చులో?

పాత అప్పులు కనుల ఎదుట విలయతాండవం చేస్తున్నాయి. రాను రాను రోజు గడవటమే కష్టమయిపోయింది. అప్పుపుట్టే మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయి. చక్రపాణికి ఈ పరిస్థితి దుర్భరంగా తయారయింది. చికాకుపెరిగిపోయింది. అయినదానికీ, కానిదానికీ ఒకటే విసుగు. ఎవరిమీద చూపించాలో తెలియక విజయమీదే విసుగు చూపించేవాడు.

బొద్దుగా ఆరోగ్యంగా వుండే పిల్లలిద్దరూ వానపాముల్లా తయారయ్యారు. డాక్టరు పరీక్షించి, వాళ్ళకు పోషకాహారం ఇవ్వాలన్నాడు. ఆహారమే కరువయితే పోషకాహారం ఎక్కడ నుండి వస్తుంది?

పాలు, గుడ్లు వీటిలో విటమినులున్నాయన్నాడు. పచ్చిబటానీలో ప్రోటీనులున్నాయని చెప్పేడు. మంచివెన్నలో చక్కటి కొవ్వు పదార్థం దొరుకుతుందన్నాడు. ఈ విషయాలన్నీ వివరంగా చెప్పిన డాక్టరు, ఇవన్నీ డబ్బులేకుండా ఎలా దొరుకుతాయో మాత్రం చెప్పలేదు. ఈ విషయాలు చెప్పినందుకు తన ఫీజుగా పదిరూపాయలు దొరకబుచ్చుకున్నాడు.

నిజానికి ఈలాటి విషయాలు చక్రపాణికి చాలా తెలుసు.

అతనికి తెలియనిదల్లా ఉద్యోగం ఎలా సంపాదించటమో, ఆ మార్గం ఒక్కటే.

ఈ చికాకుల నుండి బయటపడటానికీ, ఈ సమస్యల నుండి దూరం కావటానికీ, ఈ మనోవ్యధ నుండి దూరంగా పారిపోవటానికీ, ఒక్కటే మార్గం కన్పించిందతనికి!!

అది ఆత్మహత్య!! చావుతో తన సమస్యలన్నీ తొలగిపోతాయి!!

ఈ బాధలనుండి విముక్తి పొందటానికి మరొక మార్గం ఎంత యోచించినా

దొరకలేదు అతనికి. వారంరోజులపాటు నిరంతరమూ ఈ ఆలోచనతోనే గడిపేడు.

చివరకు ఎండ్రిన్ తాగి చచ్చిపోవాలనే నిర్ణయానికి వచ్చేడు. కానీ జరిగిందేమిటి?

తన ప్రయత్నం కాస్తా విఫలమయిపోయింది. అది కాస్తా విజయకంట పడింది.

తాను మళ్ళీ అలాటి ప్రయత్నం చేయనని దైవసాక్షిగా ప్రమాణం చేయమని బలవంతం పెట్టి మరీ చేతిలో చేయి వేయించుకుంది.

ఈ సంగతి బయటపడిన దగ్గర నుండీ విజయ శోకాలు పెడుతూనే ఉంది.

అయితే ఎన్ని ప్రమాణాలు చేసినా తన నిర్ణయం మాత్రం మార్చుకోరాదని నిర్ణయించుకున్నాడు చక్రపాణి.

మధ్యాహ్నం మూడు గంటల వరకూ మంచంమీద దొర్లేడు.

తర్వాత బట్టలు వేసుకుని వీధిలోనికి బయలుదేరాడు.

"బయటకు వెళ్తున్నారా?" విజయగొంతులో ఎంతో అనుమానం

"స్టేషన్‌కు వెళ్తున్నా"

గతుక్కుమంది విజయ "ఎందుకు?" అంది ఏడుపుముఖంతో

చక్రపాణి తన సమాధానానికి నాలిక కరుచుకున్నాడు.

"కృష్ణమూర్తి వస్తున్నాడు. వాడు తల్చుకుంటే మద్రాసులో ఏదయినా ఉద్యోగం ఇప్పించగలడు"

విజయనమ్మినట్లే చూసింది. "మళ్ళీ తొందరగా వచ్చేయండి"

"అలానే" అంటూ బయటపడ్డాడు.

కృష్ణమూర్తి రావటం అబద్ధం. తాను స్టేషన్‌కు వెళ్ళటం అంతకన్నా అబద్ధం!!

బీసెంటు రోడ్డు దాటి రాఘవయ్య పార్కు మీదనుండి కృష్ణా బేరేజీ వైపుకు నడక సాగించేడు చక్రపాణి. మూడున్నర గంటలయినా ఎండ తీవ్రత తగ్గలేదు. రోడ్డు ప్రక్కన్ను కాకాహొటల్లో కాఫీతాగేడు. ఇంకా, జేబులో ఇరవై పైసలు మిగిలేయి. ఫిల్టరు సిగరెట్టు కొని రెండు దమ్ములు పీల్చి విసిరేశాడు. 'ప్రకాశం బేరేజ్' వైపుకు మళ్ళీ నడక సాగించేడు.

వంతెనమీద నుండి కృష్ణలోనికి దూకితే నిమిషంలో ప్రాణం పోతుంది. పైగా, తనకు ఈతరాదు. అందువలన, చావటం చాలా సులువు! ఆత్మహత్యకు మనసును ఆయత్తపరచుకుని అడుగులు వేస్తున్నాడు. తను లేకపోతే, విజయగతి ఏమవుతుంది? పిల్లలగతి ఏంకాను? ఏమైనా తనకు లెక్కలేదు తానే పోయాక, పిల్లలు ఏమయిపోతే తనకేం? వడిగా అడుగులు పడుతున్నాయి.

ఇంకో ఫర్లాంగు దూరం నడిస్తే 'బేరేజ్' వస్తుంది. కృష్ణ ఒడ్డునే రోడ్డు మీద నడుస్తున్నాడు. "బాబూ... మల్లెపూలు..." పిలుపు విని పక్కకుచూసేడు

అతని కాళ్ళు బ్రేకులువేసినట్లు ఆగిపోయాయి. రెండు చక్రాల బండిమీద

మల్లెపూలు గుట్టలుగా పోసి అమ్ముతున్నాడతడు. మొండిగా మిగిలిపోయిన రెండుకాళ్ళు ముడుచుకుని, బండిమీద కూర్చున్నాడు. చేతులతో బండి నడపటానికి వీలుగా సైకిలుచైను, పెడల్సు అమర్చివున్నాయి ఆ బండికి!

అతడిని ఎక్కడో చూసినట్లు గుర్తు!

తనను చూసి చిరునవ్వు నవ్వేడు

గుబురు మీసాల మధ్య నుండి ఆ చిరునవ్వు బయటకు తన్నుకొస్తోంది.

అతడి కాళ్ళురెండూ మోకాళ్ళ వరకు తీసేశారు. ఎడం కన్ను మూసుకుపోయి వుంది. ఒకే కంటితో తనవంక చూస్తూ చిరునవ్వు చిందిస్తున్నాడు. "నన్ను మరిచిపోయారా బాబూ" అంటూ అడిగేడు. బొంగురు గొంతు. అదే చిరునవ్వు. రెండు నిమిషాలు ఆలోచించేసరికి గుర్తుకు వచ్చింది. అతడు కఱ్ఱల ఆడితీ సుబ్బయ్య! ఇక్కడే దగ్గర్లో కఱ్ఱల అడితీ వుండేది. కట్టెలమ్మిన చోటనే పూలు అమ్ముతున్నాడు. కానీ ఇతడు .... చచ్చిపోలేదన్నమాట!

సుమారు ఏడాది క్రితం...

బందరు నుండి విజయవాడ వస్తుంటే బస్సులో తన ప్రక్క సీటులోనే కూర్చున్నాడు సుబ్బయ్య. 'బాబూ, ఆ కిటికీ పక్కసీటు నాకివ్వండి చుట్ట కాల్చుకుంటాను' అంటూ అడిగేడు. తాను విసుక్కుంటూనే ఇవతలకు జరిగేడు. ఆ బస్సుకు దారిలో అతిఘోరమయిన ప్రమాదం జరిగింది. ముందుసీటులోని  సుబ్బయ్య భార్య, పిల్లలు కనుల ఎదుటే మాంసం ముద్దలయ్యేరు. సుబ్బయ్య కాళ్ళు రెండూపోయాయి. కంటిమీద పెద్ద దెబ్బ తగిలింది. తానుమాత్రం మధ్యలో వుండిపోయి స్వల్పగాయాలతో తప్పించుకోగలిగేడు.

హాస్పిటల్ నుండి బయటకు వస్తూ సుబ్బయ్యను చూసేడు. స్పృహలేకుండా మంచంమీద పడివున్నాడు, బ్రతకటం కష్టమని చెప్పేరు డాక్టర్లు.

ఆ తరువాత మళ్ళీ అతడి సంగతే తెలియలేదు.

మళ్ళీ ఇన్నాళ్ళ తరువాత అతడిని చూడటం! ఒక కన్నూ, రెండు కాళ్ళుపోయి బ్రతికి బయటపడ్డావన్నమాట! మృత్యువుతో పోరాటం జరిపి, ఈ లోకంలోనికి వచ్చేడన్నమాట!!

చక్రపాణి మెదడు చకచకా పనిచేయటం ఆరంభించింది.

సుబ్బయ్య ముఖంమీద ఎంత వెలుగు? ఎంత గొప్ప చిరునవ్వు!

అతడి భార్య, పిల్లలు అతని కనులముందే దారుణంగా చనిపోయారు. కష్టించిపనిచేసే అవకాశం కూడా లేకుండా కాళ్ళు రెండూ పోయాయి. సృష్టిలోని అందాలను, వాస్తవాలనూ దర్శించటానికి ఒకే ఒక కన్ను మిగిలింది. అందమయిన అతని ముఖం అందవికారంగా తయారయింది. అయినా సుబ్బయ్య ఇంకా బతికే వున్నాడు! బతుకుతూనే వున్నాడు!

కట్టెలమ్మినచోట చక్కగా పువ్వులమ్ముకుంటున్నాడు. మాయని చిరునవ్వు అతనిపెదాలపై!!

మరి తనకేమిటి లోపం?

తనకు కష్టంలోనూ, సుఖంలోనూ ఆదుకునే భార్య విజయవుంది, కేరింతలతో తన బాధల్ని మరిపింపజేసే పిల్లలు వున్నారు. తనకు రెండుకళ్ళూ వున్నాయి. కష్టించి పనిచేయటానికి, భవిష్యత్తులోకి సునాయాసంగా నడిచివెళ్ళిపోవటానికి రెండుకాళ్ళూ వున్నాయి. అందం వుంది. తెలివితేటలున్నాయి. చదువుంది!! మరి, తానెందుకు చావబోతున్నాడు??? నో! తాను చావటానికి వీల్లేదు.

సుబ్బయ్య గుబురుమీసాలచాటున దాగిన చిరునవ్వు చక్రపాణికి వేయి ఏనుగుల బలాన్ని ప్రసాదించింది. "బాగున్నావా సుబ్బయ్యా?" అంటూ అడిగేడు

"బాగున్నాను సార్! పువ్వులు పట్టుకెళ్ళండి" అంటూ గుప్పెడు మల్లెలు పొట్లం కట్టేడు.

"ఎందుకులే, చిల్లరలేదు" అంటూ సణిగేడు చక్రపాణి

"ఫరవాలేదు, అమ్మగారికివ్వండి" అంటూ బలవంతంగా మల్లెలపొట్లాం చేతిలో పెట్టాడు. మల్లెపూల పొట్లం చేతిలో పట్టుకుని ఇంటివైపుకు నడక సాగించేడు చక్రపాణి!! ★

(జయశ్రీ మంత్లీ ప్రత్యేక సంచిక 1978)